పన్నుల వసూళ్లలో వేగం పెంచాలి

అనుమతిలేని నిర్మాణాలు, కబ్జాలపై నిఘా పెట్టండి

- పారిశుధ్య నిర్వహణ సజావుగా నిర్వహించాలి
- వందశాతం చెత్త సేకరించాలి
- పార్కుల నిర్వహణ బాగుండాలి
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సమీక్షా సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి, జనవరి 17 : సంగారెడ్డి జిల్లాలోని మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని, ముఖ్యంగా అనుమతి లేని నిర్మాణాలు, కబ్జాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. బుధవారం కలెక్టర్‌లో మున్సిపాలిటీల వారీగా ఆమె సమీక్ష నిర్వహించారు. ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్ పన్ను, (నల్లా) కుళాయి బిల్లుల వసూళ్లు, పార్కులు, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ తదితర అంశాలపై మున్సిపాలిటీల వారీగా దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో వందశాతం ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ పన్ను, నీటి కుళాయి బిల్లుల వసూళ్లు చేయాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పన్ను వసూలు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. బిల్ కలెక్టర్ వారీగా ఆస్తి పన్ను లక్ష్యాన్ని నిర్ణయించి, రోజువారీ వసూళ్ల వివరాల నివేదికను అందించాలన్నారు. మొండి బకాయిలు ఉన్నచోట మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పనితీరు బాగాలేని బిల్ కలెక్టర్లపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. వేతనాలు, విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని, మున్సిపాలిటీల్లో ఫుట్‌పాత్, జంక్షన్లల్లో ఎక్కడా కూడా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను అనుమతించొద్దన్నారు. కమిషనర్లు పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. మున్సిపాలిటీల్లోని పార్కుల నిర్వహణ బాగుండాలన్నారు.

పారిశుధ్య పనులకు తనిఖీ చేయాలి..

పారిశుధ్య పనుల నిర్వహణపై మున్సిపల్ కమిషనర్లు రోజు వారీగా తనఖీలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టణాల్లో పార్కులు, పబ్లిక్ టాయిలెట్లు నిర్వహణపై పర్యవేక్షణ ఉండాలన్నారు. ఉదయం 6 నుంచి 6.30 వరకు పారిశుధ్య నిర్వహణ తీరుతెన్నులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని, అన్ని వార్డులు సందర్శించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో కబ్జాలు, అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదు వచ్చిన వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనుమతి లేని నిర్మాణాలను ప్రారంభ దశలోనే గుర్తించి కూల్చివేయాలని, వీధివ్యాపారులకు అవసరమున్న చోట స్ట్రీట్ వెండింగ్ జోన్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రోజూ ఇంటింటి చెత్త సేకరణ వందశాతం జరగాలన్నారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్-జోగిపేట, సదాశివపేట, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీల కమిషనర్లు, పబ్లిక్ హెల్త్ ఈఈ, డీఈలు ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' గొప్ప పథకం



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

గుమ్మడిదల, జనవరి 17 : ఆడపిల్ల పెండ్లి నిరుపేద కుటుంబాలకు భారం కాకూడదనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రారంభించారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు బుధవారం క్యాంపు కార్యాలయంలో చెక్కులు అందజేశారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాభవాని పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి చేసుకోవాలి

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

కంగ్టి, జనవరి 17 : అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి మండలాన్ని అభివృద్ధి చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల వరకే రాజకీయాలని, పేదలకు ప్రభుత్వ పథకాలు అందజేయాలన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యేను ఎంపీపీ సంగీతావెంకట్‌రెడ్డి , జడ్పీటీసీ కోట లలితాఆంజనేయులు, ఎంపీటీసీలు, సర్పంచులు శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణుసాగర్, ఎంపీడీవో ముజఫరోద్దీన్, వ్యవసాయాధికారి ప్రవీణ్‌చారి పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్, జనవరి 17 : పట్టణ సమీపంలోని ఆడిటోరియంలో బుధవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల శ్రేయస్సుకోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ ఆరుగ్యారెంటీలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

సంగారెడ్డిలో కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

సంగారెడ్డి, జనవరి17 : కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం-2024 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆవిష్కరించారు. బుధవారం పట్టణంలో క్యాంపు కార్యాలయంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను విడుదల చేశారు. కేసీఆర్ సర్కార్ హయాంలో గీత కార్మికుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఎక్సైజ్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ హరికిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి, బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారి జగదీశ్‌ల చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐలు మధుబాబు, అశోక్‌కుమార్, నాయకులు మనోహర్‌గౌడ్, కృష్ణగౌడ్, ప్రభుగౌడ్, పాండుగౌడ్, జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్, ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, జంగన్నగౌడ్, కృష్ణగౌడ్, రామాగౌడ్, నరసింహగౌడ్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని సక్రమంగా సరఫరా చేయండి

అధికారులను ఆదేశించిన సంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

సంగారెడ్డి, జనవరి 17 : మిషన్ భగీరథ తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఉదయం 10 గంటలకు 2వ స్థాయీ సంఘం (గ్రామీణాభివృద్ధి), 12 గంటలకు 4వ స్థాయీ సంఘం (విద్య, వైద్యం), మధ్యాహ్నం 2:30 గంటలకు 1వ స్థాయీ సంఘం(ఆర్థిక, ప్రణాళిక) సమావేశం, మధ్యాహ్నం 3:30 గంటలకు 7వ స్థాయీ సంఘం (పనులు) సమావేశాలు చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశాలను జడ్పీ చైర్‌పర్సన్ అనుమతితో జడ్పీ సీఈవో ఎల్లయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లడుతూ ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. నీరు వృథాగా వదిలేస్తున్న ప్రాంతాలను అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీలు, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు సరఫరా చేయాలన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, మండలాల నుంచి గ్రామాలకు అనుసంధానం చేసే రోడ్లు చాలా పాడైపోయాయని, రోడ్లు గుంతలతో దర్శనమిస్తున్నాయని, వెంటనే అధికారులు గుర్తించి మరమ్మతులు చేయాలని చైర్‌పర్సన్ కోరారు. సమావేశాల్లో సభ్యులు రాఘవరెడ్డి, అరుణరెడ్డి, సుప్రజ, రమేశ్, రాజు రాథోడ్, సునీత, మల్లికార్జున్ పటేల్ పాల్గొన్నారు.

స్థాయీ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

రావి ఆకుపై అయోధ్య రాముడు

మునిపల్లి, జనవరి 17 : ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా పట్టాభిషిక్తుడైన శ్రీరాముడి దివ్య మంగళ స్వరూపాన్ని రావి ఆకుపై మండలంలోని పెద్దగోపులారం ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న అనురాధ దాస్ పట్టాభిషిక్తుడైన శ్రీరాముడి దివ్య మంగళ స్వరూపాన్ని (రాగి ఆకుపై) అశ్వద్ధ అందంగా చిత్రీకరించి బర్దీపూర్ పీఠాధీపతితో అయోధ్యకు పంపించినట్లు ఉపాధ్యాయురాలు అనురాధ తెలిపారు. శ్రీరాముడిని చిత్రాన్ని అందంగా చిత్రికరించడంతో పలువురు అభినందించారు.

రుణాలు అందించాలి

కోహీర్, జనవరి 17 : అర్హులైన డ్వాక్రా సంఘాల మహిళలకు బ్యాంకు, స్త్రీనిధి రుణాలను అందించాలని ఐకేపీ ఏపీఎం సమ్మయ్య కోరారు. బుధవారం పట్టణంలోని పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో ఆయా గ్రామాల ఐకేపీ సీసీలు, వీఏవోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు, స్త్రీనిధి ద్వారా అందించిన రుణాలను రికవరీ చేయాలని సూచించారు. సకాలంలో చెల్లించిన సంఘాలకు మాత్రమే మరోసారి రుణాలను మంజూరు చేయించాలన్నారు. సమావేశంలో సీసీలు గోపాల్, శేఖర్, హన్మంతు, వీఏవోలు పాల్గొన్నారు.

రాజోలాలో బాలుడి కిడ్నాప్‌కు యత్నం!

- తప్పించుకున్న బాలుడు
- విచారణ చేపట్టిన హద్నూర్ పోలీసులు

కిడ్నాప్ నుంచి తప్పించుకున్న గణేశ్

న్యాల్‌కల్, జనవరి 17 : మండలంలోని రాజోలా గ్రామంలో తొమ్మిదేండ్ల బాలుడిని గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాపుకు యత్నించారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గణేశ్ (9) బాలుడు బుధవారం తెల్లవారుజామున వాకింగ్‌కు రైల్వేస్టేషన్ సమీపానికి వెళ్లాడు. అంతలోనే గుర్తుతెలియని వ్యక్తులు బాలుడిని కిడ్నాప్ చేసి బైక్‌పై తీసుకెళ్లారు. కల్‌బేమల్ అటవీ ప్రాంతం మీదుగా మామిడ్గి గ్రామం వైపు వెళ్తున్న క్రమంలో పెట్రోల్ అయిపోడంతో బైక్ ఆగిపోయింది. దీంతో గ్రామ సమీపంలోని కిరాణాషాపుకు పెట్రోల్ తీసుకునేందుకు వెళ్లాడు. ఇది గమనించిన బాలుడి అక్కడి నుంచి తప్పించుకొని పారిపోయాడు. బాలుడు కనిపించపోవడంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ఉన్న ఇండ్ల తోపాటు రైల్వే స్టేషన్‌లో వెతికినా ఆచూకీ దొరకలేదు. బాలుడు రోజు తన నానమ్మ సెల్‌ఫోన్ తీసుకుని వాకింగ్‌కు వెళ్తాడని తెలిసి కుటుంబ సభ్యులు ఫోన్‌కు చేశారు. దీంతో బాలుడు ఫోన్ లిఫ్ట్ చేసి తనను ఎవరో బైక్‌పై తీసుకెళ్తున్నారని చెప్పడంతో కుటుంబసభ్యులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలిసి బాలుడి ఆచూకీ కోసం వెతకడం ప్రారంభించారు. కొందరు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు బాలుడి ఆచూకీ కోసం బైక్‌పై మండలంలోని మామిడ్గి గ్రామం వైపు వెళ్తున్న క్రమంలో తన నానమ్మను చూసి బాలుడు అరవడంతో అగారు. దీంతో వారు రోడ్డు పక్కన ఉన్న పొలం సమీపంలోని పొదల్లో దాగిన ఉన్న బాలుడి వద్దకు వెళ్లారు. వెంటనే బాలుడిని రాజోలా గ్రామానికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న హద్నూర్ పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. కిడ్నాప్ ఎవరు యత్నించారనే వివరాలను బాలుడిని అడిగి తెలుసుకున్నారు. పోలీసులు బాలుడిని వెంట తీసుకుని కిడ్నాప్ చేసి బైక్‌పై ఎక్కడెక్కడ తీసుకెళ్లారో పరిశీలించారు. మండలంలోని రాజోలా, మామిడ్గి, బసంతపూర్ గ్రామాల్లో పోలీసులు సీసీపుటేజీలను పరిశీలించారు. కిడ్నాప్ ఘటనకు గురించి బాలుడు పొంతన లేని సమాచారం చెప్పాడు. సంక్రాంతి సెలవులు అయిపోవడంతో పాఠశాలకు వెళ్లేందుకు ఇష్టం లేక ఇలా చేసి ఉండవచ్చని.. ఇది ఫేక్ కిడ్నాప్ అని పోలీసులు అంటున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హద్నూర్ పోలీసులు పేర్కొన్నారు.

ఫార్మేషన్ రోడ్డు పనులు ప్రారంభం

ఫార్మేషన్ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ మీనాక్షీసాయికుమార్

మునిపల్లి, జనవరి 17 : పంటపొలాలకు వెళ్లడానికి రైతులకు ఫార్మేషన్ రోడ్లు ఎంతో ఉపయోగపడతాయని జడ్పీటీసీ మీనాక్షీసాయికుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని ఖమ్మంపల్లిలో ఫార్మేషన్ రోడ్డు పనులను సర్పంచ్ జాస్మిన్ గుడ్డుపటేల్ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామానికి చెందిన తుడుం బుచ్చయ్య పొలం నుంచి గాండ్ల సంగమేశ్వర్ పొలం వరకు ఫార్మేషన్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఉప సర్పంచ్ శాంతమ్మాసుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయోధ్యకు రావాలని సిద్ధేశ్వరస్వామికి పిలుపు

ఝరాసంగం, జనవరి 17 : ఈ నెల 22న అయోధ్యలోని రామమందిరంలో రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరు కావాలని బుధవారం మండలంలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమానికి చెందిన డాక్టర్ సిద్ధేశ్వరస్వామికి శ్రీరామ జన్మభూమి ట్రస్టు ఆహ్వానాన్ని పంపించిందని దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి దత్తగిరి ఆవధూత గిరి మహారాజ్ తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ ట్రస్టు చైర్మన్ అల్లాడి వీరేశం, ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వరస్వామి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు రావాలని ఆహ్వానాన్ని అందుకున్న డాక్టర్ సిద్ధేశ్వరస్వామి

ఆలయ నిర్మాణానికి రూ.1.50 లక్షల విరాళం

ఆలయ నిర్మాణానికి విరాళం ఇస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ ఏసయ్య

రాయికోడ్, జనవరి 17 : రాయికోడ్‌లో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి బుధవారం ఏఎంసీ చైర్మన్, కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు ఏసయ్య రూ.1.50 లక్షల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు విఠల్, మాణెయ్య, తుకారం, శివకుమార్, విఠల్, సతీశ్‌పంతులు, రామకృష్ణ పాల్గొన్నారు.

టేకూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

టేకూర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

న్యాల్‌కల్, జనవరి 17 : మండలంలోని టేకూర్ గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు పనులను బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి ప్రారంభించారు. సీసీ రోడ్డు పనులకు ప్రభుత్వం రూ.15లక్షలు మంజూరు చేసింది. ఈ సందర్భంగా సర్పంచ్ అమీర్ మాట్లాడుతూ విడతల వారీగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, గ్రామ నాయకులు సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

లావాణిపట్టా భూమిలో నిర్మాణాల పరిశీలన

గుమ్మడిదల, జనవరి 17 : అన్నారం గ్రామంలోని సర్వేనంబర్ 261 లావాణి పట్టా భూమిలో నిర్మాణాలు జరుగుతున్నట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం రావడంతో బుధవారం తహసీల్దార్ గంగాభవాని, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. లావాణిపట్టా భూమిలో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించిన అధికారులు రికార్డుల ప్రకారం పూర్తి వివరాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

జహీరాబాద్‌లో ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

జహీరాబాద్, జనవరి 17: అర్హులైన వారు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రవీందర్ తెలిపారు. బుధవారం పట్టణంలో ఎంపీడీవో కార్యాలయం ర్యాలీ నిర్వహించి, 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. బీఎల్‌వోలు అందుబాటులో ఉండి కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులపై దరఖాస్తులు తీసుకుంటారన్నారు. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం-6, మార్పులు చేర్పులకు ఫారం-8 వినియోగించుకోవాలన్నారు. ఈ నెల 1వ తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రాజు, పట్టణ ఎస్సై శ్రీకాంత్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సతీశ్, ఆర్ఐ రుక్మాద్దీన్ వివిధ శాఖల అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న ఆర్డీవో పాండు

అందోల్, జనవరి 17 : కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం సజావుగా సాగేలా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు అందోల్-జోగిపేట ఆర్డీవో పాండు తెలిపారు. బుధవారం జోగిపేటలో ఓటరు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీల్లో ఓటరు నమోదుపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. క్లాక్‌టవర్ నుంచి అందోల్-జోగిపేటల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ అంటోనీ, డిప్యూటీ తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, ఎస్సై అరుణ్‌కుమార్ గౌడ్ ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

కోహీర్, జనవరి17 : త్వరలో నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ శాంతకుమారి, ఎంపీడీవో సుజాతనాయక్ కోరారు. బుధవారం పట్టణంలోని ఎంపీపీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ సత్యనారాయణ, సర్వేయర్ బాల్‌రాజ్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కంగ్టిలో సందడిగా 2కే రన్

కంగ్టిలో 2కే రన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

కంగ్టి, జనవరి 17 : ఓటరు నమోదు కార్యక్రమంపై బుధవారం అధికారులు కంగ్టిలో 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక క్రాంతి చౌక్ నుంచి నారాయణఖేడ్ రోడ్డు వైపు 2కే రన్ చేపట్టారు. తహసీల్దార్ విష్ణుసాగర్ ఎంపీడీవో ముజఫరోద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ జూబేర్, పంచాయతీ కార్యదర్శి సుభాశ్, తదితరులు పాల్గొన్నారు.

రాయికోడ్‌లో..

రాయికోడ్, జనవరి 17 : 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాయికోడ్‌లో 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశం, ఉప తహసీల్దార్ విజయకుమార్, ఆర్ఐలు ప్రభాకర్, రామచందర్, ఏఎస్సై ఎక్బల్ పాల్గొన్నారు.

రాయికోడ్‌లో ఓటు హక్కుపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

బహిరంగ ప్రకటన

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా కక్షిదారుడు అయిన వై అభిజీత్ S/O వై ఈ ఫ్రసాద రెడ్డి 32 సం||లు, వ్యాపారవేత్త, ఫ్లాట్ నంబర్ 424, రోడ్డు నంబర్ 78, జూబ్లీహిల్స్, హైదరాబాద్, తెలంగాణ – గంగారం గ్రామము, కొండాపూర్ మండలము, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రములో గల క్రింద కనబరచిన ఆస్తిని, క్రింద కనబరచిన వ్యక్తుల నందు ఖరీదుకు కొనుగోలుచేసి, రిజిస్ట్రేషన్ చేయించు కొనుటకు సిద్ధముగా ఉన్నారు. ఇట్టి విషయములో ఎవరికైనా ఎలాంటి హక్కు గానీ, అనుభవము గానీ, క్లెయిములు గానీ వున్న యెడల, వాటిని నిరూపించు పత్రాలను, ఆధారాలను, నా ఎదుట ఈ ప్రకటన వెలువడిన ఏడు(7) దినములలోగా హాజరు పరుచవలయును. అట్లు హాజరుపరచని యెడల నా కక్షిదారుడు ఆస్తిని వివాదరహితముగా భావించి క్రింద కనబరిచిన వ్యక్తుల నుండి రిజిష్టర్ చేయించుకొని, విక్రయ ధనాన్ని చెల్లిస్తాడు. తదుపరి ఉత్పన్నమయ్యే సమస్యలకు నా కక్షిదారుడు బాధ్యుడుకాదు.

హక్కుదారుని పేరు	సర్వే నంబర్	విస్తీర్ణము Ac-Guntas	హద్దులు
వనపర్తి భాస్కర్ S/O వి. నిరుపరాజు గంగారం, కొండాపూర్ సంగారెడ్డి జిల్లా	198/ఈ2/1/2	ఎ 0-10 గుంటలు	ఉ॥ నిరుపరాజు దు॥ హరిబాబు తూ॥ రోడ్ పు॥ రాంరెడ్డి
మహమ్మద్ ఖాసిమ్ S/O పతె మహమ్మద్ గంగారం, కొండాపూర్ సంగారెడ్డి జిల్లా	181/ఇ/1/1	ఎ 1-15 గుంటలు	ఉ॥ ఇమామ్ దు॥ ఫెరోజ్ తూ॥ అభిజీత్ పు॥ ఇమామ్
వనపర్తి అనంతయ్య S/O వి. పరమయ్య గంగారం, కొండాపూర్ సంగారెడ్డి జిల్లా	178/ఉ2/1	ఎ 0-17.5 గుంటలు	ఉ॥ రాంరెడ్డి దు॥ అభిజీత్ తూ॥ ఫకాశం పు॥ అభిజీత్
వి. వీరయ్య S/O వి. చంద్రయ్య గంగారం, కొండాపూర్ సంగారెడ్డి జిల్లా	178/ఇ/2/1/1	ఎ 1-10.5 గుంటలు	ఉ॥ లాపణ్ణ దు॥ రామచంద్ర రెడ్డి తూ॥ అంజయ్య పు॥ ఇ. రవి
	మొత్తం	ఎ 3-13 గుంటలు	

వి. రోహిత్
న్యాయవాది, తెలంగాణ హైకోర్టు
H. No. 8-2-269/W/3, రోడ్ నెం. 2, బంజారా హిల్స్,
హైదరాబాద్ - 500033. మొబైల్ - 95500 10101